## 6వ అధ్యాయం

# మస్జిద్ వ్యవస్థ

# ٦ - بَابُ الْمَسَاجِدِ

195. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించారు: ఇండ్లల్లో (మరియు పేటల్లో) నమాజ్ చేసే స్థలాలను నిర్ధారించుకోవాలనీ, వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆదేశించారు. (అహ్మద్, అబూదావూద్, తిర్మిజీలు దీనిని ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'ముర్సల్'గా ఖరారు చేశారు)

(١٩٥) عَنْ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أَمَرَ رَسُولُ اللّٰهِ ﷺ بِبِنَاءِ الْمَسَاجِدِ فِي الدُّوْرِ. وَأَنْ تُنَظَّفَ وَتُطَيَّبَ. رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَصَحَّحَ إِرْسَالَهُ.

### సారాంశం

మస్జిదును, నమాజ్ చేసే స్థలాలను పరిశుభ్రంగా, పరిశుద్ధంగా ఉంచుకోవాలి. సాధ్యమైనంతవరకు ఆ స్థలాలలో సువాసనను, పరిమళాన్ని వెదజల్లాలి. హదీసులో 'దువర్' అనే పదం వచ్చింది. దీని అర్థం వీధి అనీ, పేట అనీ వస్తుంది. అంటే మనం నివసించే పట్టణంలో పెద్ద మస్జిదుతో పాటు చిన్న చిన్న మస్జిదులను కూడా పేటల్లో, బస్తీలలో నిర్మించుకోవాలి. వాటిని చాలా పరిశుభ్రంగా ఉంచాలి. సుగంధద్రవ్యాల గుభాళింపుతో వాటిని అత్యంత పరిశుద్ధంగా ఉంచాలి. మన ఇండ్లల్లో కూడా ఏదో ఒక గదిని లేక మూల ప్రదేశాన్ని నమాజ్ కొరకు కేటాయించి దానిని ఎంతో నీటుగా ఉంచాలి. ఈ స్థలంలో ఇంటి ఆడవాళ్లు నమాజ్ చేయటంతో పాటు మగవారు కూడా సున్నత్, నఫిల్ నమాజులను ఆచరించవచ్చు.

196. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: దేవుడు యూదులను సర్వనాశనం చేయుగాక! వాళ్లు దైవప్రవక్తల సమాధులను సాష్టాంగ (సజ్దా) స్థలంగా చేసుకున్నారు. (బుఖారీ, ముస్లిం - ముస్లింలో 'క్రైస్తవులు' అన్న పదం కూడా చేర్చబడింది)

(١٩٦) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «**قَاتَلَ اللّٰهُ الْيَهُودَ، اتَّخَذُوا قُبُورَ أَنْبِيَائِهِمْ مَسَاجِدَ**». مُتَّفَقٌ عَلَيْهِ، وَزَادَ مُسْلِمٌ: «**وَالنَّصَارَى**».

وَلَهُمَا مِنْ حَدِيْثِ عَائِشَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهَا: كَانُوا إِذَا مَاتَ فِيْهِمُ الرَّجُلُ الصَّالِحُ بَنَوْا عَلَى قَبْرِهِ مَسْجِداً. وَفِيهِ: أُوْلَئِكَ شِرَارُ الْخَلْقِ.

బుఖారీ, ముస్లింలలో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) చే ఇలా ఉల్లేఖించబడింది: "వారిలో పుణ్యపురుషుడు ఎవరయినా మరణిస్తే వాళ్లు ఆయన సమాధిని 'సజ్దా'గా చేసుకునేవారు." ఈ హదీసులో "వాళ్లు అత్యంత నీచమయిన జీవులు" అన్న వాక్యం కూడా ఉంది.

## సారాంశం

దివ్య ఖుర్ఆన్ ప్రకారం వీళ్లు (యూదులు, క్రైస్తవులు) గ్రంథవహులు. వారికి ఆకాశ గ్రంథాలు ప్రసాదించబడ్డాయి. కాని విచారకరమయిన విషయం ఏమిటంటే వారు గ్రంథజ్ఞానం ఉండికూడా ప్రవక్తల సమాధులను పూజా స్థలాలుగా చేసుకున్నారు. ఆ సమాధుల వద్ద తమ కోరికలు వెలిబుచ్చుతూ మొక్కుకునేవారు. నిషిద్ధమయిన, అధర్మమయిన ఈ చేష్టను యూదులు మొదలెట్టగా, క్రైస్తవులు కూడా వారి పంథాలోనే నడవసాగారు. ఈ విధంగా వీళ్లు సృష్టికర్త దృష్టిలో అత్యంత తీవ్రమయిన, క్షమార్హం కాని షిర్క్ (బహుదైవోపాసన) కు ఒడిగట్టారు. కాగా; దర్గాల వద్దకు పోయి, సమాధులను ఆరాధనా స్థలాలుగా మారుస్తున్న నేటి సోకాల్డ్ ముస్లిములు, తాము ఎవరిని అనుసరిస్తున్నారో, తమ ఈ చేష్ట సృష్టికర్త ఆగ్రహాన్ని ఏ విధంగా కొనితెస్తుందో కాస్త ఆలోచించాలి. ముస్లింల ఈ చేష్ట కూడా విగ్రహారాధనా పరిధిలోకి వస్తుందనటంలో ఎలాంటి సందేహానికి తావులేదు. ఈ పనిని అన్యులు చేస్తే అది శాపగ్రస్తమూను, ముస్లిములు చేస్తే పుణ్యప్రదమూనా?! ఇదెక్కడి ధర్మం? ఇది ఆత్మ వంచన తప్ప మరేమీ కాదు. అల్లాహ్ ముస్లిములకు ఇలాంటి వికృత చేష్టలకు దూరంగా మెలిగే సద్బుద్ధి నొసగుగాక!

(١٩٧) وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: بَعَثَ النَّبِيُّ ﷺ خَيْلاً، فَجَاءَتْ بِرَجُلٍ، فَرَبَطُوْهُ بِسَارِيَةٍ مِنْ سَوَارِ الْمَسْجِدِ»، الْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

197. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒకసారి ఓ చిన్న సైనిక (గస్తీ) దళాన్ని ఏదో ప్రాంతం వైపునకు పంపించారు. ఆ సైనికులు ఒక (ముష్రిక్) వ్యక్తిని నిర్బంధించి దైవప్రవక్త (సఅసం) సన్నిధిలోకి తీసుకువచ్చారు. ఆ వ్యక్తిని మస్జిదె నబవీ స్థంభాలలోని ఒక స్థంభానికి కట్టివేశారు (ఖైదీగా బంధించారు).

(బుఖారీ, ముస్లిం)

## సారాంశం

అవసరమైనప్పుడు ముష్రిక్కును మస్జిద్‌లోకి రప్పించటం, మస్జిదును కారాగారంగా ఉపయోగించటం ధర్మసమ్మతమేనని ఈ హదీసు ద్వారా అవగతమవుతోంది. ఇందులో అనేక పరమార్థాలు

దాగి వున్నాయి. నిర్బంధితుడైన అవిశ్వాసి ముస్లింల ఆరాధనా రీతులను దగ్గరినుంచి గమనిస్తాడు. వాళ్లు ఏవిధంగా బారులు తీరి, హెచ్చుతగ్గులు లేకుండా నిలబడుతున్నారో, ఏవిధంగా ఒకే సమయంలో దైవ సన్నిధిలో మోకరిల్లి ప్రార్థిస్తున్నారో, ఏవిధంగా దివ్య గ్రంథపారాయణం చేస్తున్నారో శ్రద్ధగా తిలకిస్తాడు. ప్రభావితుడవుతాడు. హదీసులో నిర్బంధితునిగా తీసుకురాబడిన వ్యక్తి యమామ ప్రాంతపు నాయకుడు సమామ బిన్ ఉసాల్. ఉమ్రా చేసే ఉద్దేశ్యంతో వెళుతూ పట్టుబడ్డాడు. మస్జిదె నబవీ (ప్రవక్త మస్జిద్)లో ఆ వ్యక్తిని దైవప్రవక్త (స) మూడు రోజులపాటు బంధించి ఉంచారు. ఎట్టకేలకు అతడు ఇస్లాం మాధుర్యాన్ని ఆస్వాదించాడు.

(١٩٨) وَعَنْهُ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ أَنَّ عُمَرَ مَرَّ بِحَسَّانَ يُنْشِدُ فِي الْمَسْجِدِ، فَلَحَظَ إِلَيْهِ، فَقَالَ: قَدْ كُنْتُ أُنْشِدُ فيه، وَفِيْهِ مَنْ هُوَ خَيْرٌ مِّنْكَ. مُتَّفَقٌ عَلَيْهِ.

198. హజ్రత్ అబూ హురైరా (రజి) కథనం: హజ్రత్ ఉమర్ (రజి) గారు హజ్రత్ హస్సాన్ (రజి) కూర్చున్న వైపు నుండి వెళుతున్నారు. ఆయన మస్జిద్‌లో కూర్చుని కవితలు చెబుతున్నారు. హజ్రత్ ఉమర్ (రజి) ఆయన వంక తీక్షణంగా చూచారు. '(ఎందుకలా కొరకొరా చూస్తారు?) మస్జిద్‌లో మీకన్నా శ్రేష్ఠులు (దైవప్రవక్త - సఅసం) ఉన్నప్పుడు కూడా నేను ఇలాగే కవిత్వం చెప్పేవాడిని' అని ఆయన (రజి) చెప్పారు. (బుఖారీ, ముస్లిం)

## సారాంశం

ఈ హదీసును బట్టి మస్జిదులో కవితలు చెప్పటం సమ్మతమేగాని ఆ కవిత్వం తౌహీద్ (ఏక దైవారాధన) కు వ్యతిరేకంగా ఉండకూడదు. ఇంకా అందులో బహుదైవోపాసనా భావాలుగానీ, మిథ్యావాదాలుగానీ, ద్వంద్వార్థాలు వచ్చే మాటలుగానీ, నమాజీల ఏకాగ్రతను పాడుచేసే పరాచికాలు గానీ ఉండరాదు. హజ్రత్ హస్సాన్ (రజి) మస్జిద్‌లో కూర్చుని అవిశ్వాసుల ఆత్మ విశ్వాసాన్ని నీరుగార్చే కవితలు అల్లేవారు. దైవప్రవక్త (స) ఈ కవితల్ని విని "పరిశుద్ధాత్మ నీకు తోడ్పడుగాక! నీ కవితలు అవిశ్వాసులకు బాణాల్లా గుచ్చుకుంటున్నాయి" అని దీవించేవారు.

## హదీసు ఉల్లేఖకులు

హస్సాన్ బిన్ సాబిత్ (రజి) అన్సార్ సహాబీ. ఖజ్రజ్ తెగకు చెందినవారు. 'ప్రవక్త (స) కవి'గా బిరుదు పొందారు. ఆనాటి పట్టణ కవులలో హస్సాన్ బిన్ సాబిత్ (రజి) గారే అందరికన్నా గొప్పవారు. హిజ్రీ 54లో హజ్రత్ ముఆవియా (రజి) పరిపాలనా కాలంలో మరణించారు. హిజ్రీ 55లో మరణించారని మరికొందరు వాదిస్తున్నారు. మరణ సమయంలో ఆయన వయస్సు 120 సంవత్సరాలన్నది గమనార్హం.

(١٩٩) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَنْ سَمِعَ رَجُلاً يَنْشُدُ ضَالَّةً فِي الْمَسْجِدِ فَلْيَقُلْ: لاَ رَدَّهَا اللَّهُ عَلَيْكَ، فَإِنَّ الْمَسَاجِدَ لَمْ تُبْنَ لِهَذَا». رَوَاهُ مُسْلِمٌ.

199. హజ్రత్ అబూ హురైర (రజి) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు - "ఏ మనిషయినా తాను పోగొట్టుకున్న వస్తువును మస్జిద్‌లో వెతుకుతున్నాడని ఎవరైనా వింటే, 'దైవచిత్తమయితే ఆ వస్తువు దొరకకుండుగాక!' అని అనండి. మస్జిదులు నిర్మించబడింది ఈ ఉద్దేశ్యం కొరకు కాదు కదా!" (ముస్లిం)

### సారాంశం

ఈ హదీసులో అందరికీ ఒక హెచ్చరిక ఉంది. ఎక్కడో పోగొట్టుకున్న వస్తువును మస్జిద్‌లో అన్వేషించటంలో అర్థం లేదు. ఇది మస్జిద్ మర్యాదకు విరుద్ధమయిన విషయం. ఈ మధ్య మస్జిదు వేదికలనుండి చేయబడే అనేకానేక ప్రకటనలు కూడా సమంజసమైనవి కావు. అయ్యవారి ఆవులు పోయినా, కామందులవారి కోడిపుంజు కనబడకుండాపోయినా ప్రకటనలు చేయడానికి మస్జిద్ మెంబరే దొరికిందా? ఈ జంతువులు మస్జిద్‌లోకయితే రావుకదా? ఒకవేళ అంతగా అడిగి ఆరా తీయదలచుకుంటే మస్జిద్ గేటు బయట నిలబడి వచ్చేపోయేవారిని అడగవచ్చు.

(٢٠٠) وَعَنْهُ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِذَا رَأَيْتُمْ مَنْ يَبِيعُ أَوْ يَبْتَاعُ فِي الْمَسْجِدِ فَقُولُوا: لاَ أَرْبَحَ اللَّهُ تِجَارَتَكَ». رَوَاهُ النَّسَائِيُّ وَالتِّرْمِذِيُّ، وَحَسَّنَهُ.

200. హజ్రత్ అబూ హురైర (రజి) కథనానుసారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "మీలో ఎవరినయినా మస్జిద్‌లో క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు మీరు చూస్తే, 'దేవుడు నీ వర్తకంలో, లావాదేవీలలో లాభం చేకూర్చకుండుగాక!' అని అనండి." (ఈ హదీసును తిర్మిజీ, నసాయి ఉల్లేఖించారు. తిర్మిజీ దీనిని 'హసన్'గా ఖరారు చేశారు)

### సారాంశం

మస్జిదులలో వ్యాపార లావాదేవీలు, కొనుగోలు - అమ్మకాలు జరపరాదని ఈ హదీసు ద్వారా స్పష్టమవుతున్నది. అంటే మస్జిదులను వాణిజ్య కేంద్రాలుగా, వ్యాపార మండీలుగా మార్చుకోరాదు. మస్జిదులను నిర్మించేది దైవారాధన, దైవనామస్మరణ కోసమే గాని వర్తకం కోసం కాదు. మస్జిద్‌లయొక్క ఈ మర్యాదను మనం ఖాతరు చేయకపోతే అవి తమ ఉద్దేశ్యాన్ని, అసలు లక్ష్యాన్ని కోల్పోతాయి.

(٢٠١) وَعَنْ حَكِيمِ بْنِ حِزَامٍ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «**لاَ تُقَامُ الحُدُودُ فِي المَسَاجِدِ، وَلاَ يُسْتَقَادُ فِيهَا**». رَوَاهُ أَحْمَدُ وَأَبُو دَاوُدَ بِسَنَدٍ ضَعِيفٍ.

201. హజ్రత్ హకీమ్ బిన్ హిజామ్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు : "మస్జిదులలో శిక్షలు విధించటంగానీ, వాటిలో ఖిసాస్ (రక్త పరిహారం) తీసుకోవటంగానీ చేయరాదు." (ఈ హదీసును అబూదావూద్, అహ్మద్ బలహీన ఆధారాలతో ఉల్లేఖించారు)

### సారాంశం

మస్జిదులు దైవారాధన కోసం నిర్మించబడ్డాయి. అవి పవిత్ర స్థలాలు. అందుచేత వాటిలో హద్దులు (శిక్షలు) విధించటం, రక్తం ప్రవహింపజేయటం వంటివి చేయరాదు. శిక్షల్ని అమలుపరచే స్థానాలను ప్రత్యేకంగా నిర్ధారించుకోవాలి.

### హదీసు ఉల్లేఖకులు

హకీమ్ బిన్ హిజామ్ (రజి) మరో పేరు అబూ ఖాలిద్. ఖురైష్ వర్గంలోని అసద్ తెగకు చెందినవారు. హజ్రత్ ఖదీజా (ర.అన్హా) కు అన్న కుమారులవుతారు. ఖురైషు కులీనులలో ఒకరుగా గుర్తింపుపొందారు. ఏనుగుల వాళ్ల సంఘటన జరగక 13 సంవత్సరాల క్రితం మక్కాలో జన్మించారు. మక్కా విజయం సందర్భంగా ఇస్లాం స్వీకరించారు. హిజ్రీ 54 తరువాత మదీనాలో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు 120 సంవత్సరాలు. అంటే 60 యేండ్లు అజ్ఞాన కాలంలోనూ, మరో 60 యేండ్లు ఇస్లాంలోనూ గడిచాయి. ఆయనకు నలుగురు కుమారులు. నలుగురూ సహాబీలుగా పరిగణించబడ్డారు. మర్యాదస్తులు.

(٢٠٢) وَعَنْ عَائِشَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهَا قَالَتْ: أُصِيبَ سَعْدٌ يَوْمَ الْخَنْدَقِ، فَضَرَبَ عَلَيْهِ رَسُولُ اللهِ ﷺ خَيْمَةً فِي الْمَسْجِدِ، لِيَعُودَهُ مِنْ قَرِيبٍ. مُتَّفَقٌ عَلَيْهِ.

202. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: కందక యుద్ధ సందర్భంగా హజ్రత్ సాద్ (రజి) గాయపడగా దైవ ప్రవక్త (సఅసం) ఆయనకు దగ్గరవుండి వైద్యసేవలు చేసే నిమిత్తం మస్జిద్‌లో పందిరి వేయించారు. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

దీన్నిబట్టి అత్యవసర సమయాల్లో రోగులను, క్షతగాత్రులను పరామర్శించే, వైద్యసదుపాయాలు కల్పించే ఉద్దేశ్యంతో మస్జిదులో ప్రత్యేక క్యాంపులు (శిబిరాలు) స్థాపించవచ్చని ఈ హదీసు ద్వారా అర్థమవుతోంది. అలాగే మస్జిదులో నిద్రించటం, రోగిని పరామర్శించటం, క్షతగాత్రులకు సేవలు చేయటం, వైద్యసదుపాయాలను సమకూర్చటం కూడా ధర్మసమ్మతమే.

## హదీసు ఉల్లేఖకులు

ఇక్కడ సాద్ (రజి) అంటే సాద్ బిన్ ముఆజ్ అన్నమాట! ఈయన 'ఔస్' తెగ నాయకుడు. పెద్ద సహాబీలలో ఒకరుగా పరిగణించబడతారు. రెండు ఉఖబా ప్రమాణాలలో కూడా హాజరయ్యారు. ఈయన ఇస్లాం స్వీకరించిన కారణంగా బనూ అబ్దె అష్హల్ తెగ కూడా ఇస్లాం స్వీకరించింది. ఈయన తన తెగకు సర్దారుగా, మర్యాదస్తుడైన వ్యక్తిగా పేరు సంపాయించారు. ఈయన తెగవారు ఈయన మాటను జవదాటేవారు కాదు. కందక యుద్ధంలో బాణం గుచ్చుకుని శరీరం నుండి రక్తం తీవ్రంగా ప్రవించింది. ఈ బాధతోనే ఆయన (రజి) బనూ ఖురైజ సంఘటన అనంతరం - హిజ్రీ 5 జీఖఅదలో - మరణించారు.

(٢٠٣) وَعَنْهَا قَالَتْ: رَأَيْتُ رَسُولَ اللهِ ﷺ يَسْتُرُنِي، وَأَنَا أَنْظُرُ إِلَى الْحَبَشَةِ يَلْعَبُونَ فِي الْمَسْجِدِ، اَلْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

203. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను చూచాను, ఆయన (స) నా కొరకు పరదా కట్టారు. నేను, మస్జిదులో క్రీడా విన్యాసాలు చేస్తున్న అబిసీనియన్లను (నీగ్రోలను)చూస్తూ నిలబడ్డాను. (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

పండుగలు, పర్వదినాలలో, ఆనంద సమయాలలో మస్జిదు ప్రాంగణంలో కర్రసాము చేయటం, యుద్ధ విన్యాసాలు ప్రదర్శించటం సమ్మతమేనని ఈ హదీసు ద్వారా ద్యోతకమవుతున్నది. అలాగే అపరిచిత పురుషుల సామూహిక ప్రదర్శనలు కూడా స్త్రీలు తెరచాటున ఉండి చూడవచ్చు.

(٢٠٤) وَعَنْهَا أَنَّ وَلِيْدَةً سَوْدَاءَ كَانَ لَهَا خِبَاءٌ فِي الْمَسْجِدِ، فَكَانَتْ تَأْتِيْنِي، فَتَحَدَّثُ عِنْدِي. اَلْحَدِيْثَ. مُتَّفَقٌ عَلَيْهِ.

204. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం: "ఒక నల్లని ఆడపిల్ల కోసం మస్జిద్‌లో శిబిరం వేయబడింది. ఆ పిల్ల నాతో మాట్లాడటానికి వస్తూ ఉండేది." (బుఖారీ, ముస్లిం)

### సారాంశం

స్త్రీ కూడా రాత్రిపూట మస్జిదులో ఉండగలదని ఈ హదీసువల్ల స్పష్టమవుతున్నది. అయితే ఉపద్రవానికి, గొడవలకు ఏమాత్రం అవకాశం లేని శుభప్రదమయిన వాతావరణంలోనే ఇలాంటి దృష్టాంతాలు నెలకొల్పటం సాధ్యమవుతుంది.

ఇది సుదీర్ఘమయిన హదీసులోని ఒక భాగం మాత్రమే. పూర్తి హదీసు బుఖారీలో వుంది.

(٢٠٥) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ

205. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అనస్

قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «الْبُصَاقُ فِي الْمَسْجِدِ خَطِيئَةٌ، وَكَفَّارَتُهَا دَفْنُهَا». مُتَّفَقٌ عَلَيْهِ.

(రజి) తెలిపారు - "మస్జిద్‌లో ఉమ్మి వేయటం పాపం. దీని పరిహారం ఉమ్మిని పూడ్చిపెట్టడమే. (బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

మస్జిద్ దైవారాధన నిమిత్తం నిర్మించబడింది. దైవారాధన జరిగే చోటు పవిత్రంగా ఉండాలి. అశుద్ధతకు, మాలిన్యానికి అక్కడ ఎలాంటి ఆస్కారముండకూడదు. మస్జిద్‌లో ఉమ్మివేయటం మస్జిద్ మర్యాదకు విరుద్ధాంశం. అందులో ఏది జరిగినా సభ్యతా సంస్కారాలకు ప్రతిబింబంగా ఉండాలి. అసభ్యంగా, అమర్యాదకరంగా ప్రవర్తించి పవిత్రమయిన వాతావరణాన్ని పాడు చేయకూడదు. అందుకే మస్జిద్‌లో ఉమ్మటం మహాపాపంగా పరిగణించబడింది. ఎవరయినా తెలియక అలా చేస్తే దానికి పరిహారం (కప్ఫారా) పూడ్చిపెట్టడమే. (ఒకవేళ నాపరాయిపై లేక గచ్చుపై ఉమ్మివేస్తే దాన్ని శుభ్రంగా కడిగివేయాలి)

(٢٠٦) وَعَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لَا تَقُومُ السَّاعَةُ حَتَّى يَتَبَاهَى النَّاسُ فِي الْمَسَاجِدِ». أَخْرَجَهُ الْخَمْسَةُ إِلَّا التِّرْمِذِيَّ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

206. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా చెప్పారు: "ప్రజలు మస్జిదుల (నిర్మాణం)పై గర్వాన్ని చాటనంతవరకూ ప్రళయం సంభవించదు." (దీనిని 'ఐదుగురి'లో తిర్మిజీ తప్ప అందరూ ఉల్లేఖించారు - ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా ఖరారు చేశారు)

**సారాంశం**

ప్రళయదినం సమీపించేముందు ఒక కాలం రానున్నది. ఆ కాలంలో ప్రజలు అందమైన మస్జిదులను నిర్మిస్తారు. వాటిని అపురూపంగా తీర్చిదిద్దుతారు. మా మస్జిద్ ఫలానా వారు కట్టిన మస్జిద్‌కన్నా అందంగా ఉందని బడాయి చాటుకుంటారు. కాని శోచనీయమయిన విషయం ఏమిటంటే ఆ మస్జిదులు నమాజీలతో కళకళలాడే బదులు వెల వెల బోతుంటాయి. జనులు మస్జిదులనయితే పోటీపడి నిర్మిస్తారుగానీ నమాజ్ కోసం రారు. తమపట్ల నిర్మాతలు కనబరుస్తున్న నిర్లక్ష్యవైఖరిపై మస్జిదులు విలపిస్తూ ఉంటాయి.

(٢٠٧) وَعَنِ ابْنِ عَبَّاسٍ رَضِيَ اللهُ تَعَالَى عَنْهُمَا قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «مَا

207. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు - "మస్జిదుల అలంకరణ, ముస్తాబు గురించి నాకు ఆజ్ఞాపించబడలేదు" (అబూదావూద్

أُمِرْتُ بِتَشْيِيدِ الْمَسَاجِدِ». أَخْرَجَهُ أَبُو دَاوُدَ، وَصَحَّحَهُ ابْنُ حِبَّانَ.

దీనిని ఉల్లేఖించారు - ఇబ్నె హిబ్బాన్ దీనిని ప్రామాణికమైన హదీసుగా ఖరారు చేశారు).

**సారాంశం**

ఆర్భాటంగా మస్జిదులపై నగిషీలు వేయటం, అట్టహాసంగా విద్యుద్దీపాలతో ముస్తాబు చేయటం సమంజసంకాదని పై హదీసు ద్వారా స్పష్టమవుతోంది. మస్జిదులను దైవ నామస్మరణ ద్వారా, నమాజ్ ద్వారా కళకళలాడేలా చేయమని ఆజ్ఞాపించబడింది. దేవుని దృష్టిలో అసలు కళ 'ఆరాధనే'. ఈ కళను పట్టించుకోకుండా కృత్రిమమయిన కళాకాంతులపై శ్రద్ధచూపటంలో అర్థం లేదు. మస్జిదులలో మోతాదుకు మించిన అలంకరణ వల్ల నమాజ్‌లో ఏకాగ్రతకు భంగం వాటిల్లే అవకాశం ఉంది. పైగా అట్టహాసంతో కూడిన నగిషీలు, అలంకరణలు రాజుల, చక్రవర్తుల సున్నత్ (సంప్రదాయం) మాత్రమే గానీ ప్రవక్త సంప్రదాయం కాదు. వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ మస్జిదె నబవీలో తొలిసారిగా నగిషీలు వేయించాడు. దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) కాలంలోగానీ, ధర్మ ఖలీఫాల పరిపాలనా కాలంలోగానీ ఇలాంటి వినూత్న పోకడలు మస్జిద్‌లలో ఎక్కడా కానరావు. సత్య ప్రేమికులయిన ఉలమా సయితం ఇలాంటి విషయాలపై నోరు విప్పని పరిస్థితి దాపురించింది.

(٢٠٨) وَعَنْ أَنَسٍ رَضِيَ اللّٰهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللّٰهِ ﷺ: «عُرِضَتْ عَلَيَّ أُجُورُ أُمَّتِي، حَتَّى الْقَذَاةُ يُخْرِجُهَا الرَّجُلُ مِنَ الْمَسْجِدِ». رَوَاهُ أَبُو دَاوُدَ وَالتِّرْمِذِيُّ، وَاسْتَغْرَبَهُ، وَصَحَّحَهُ ابْنُ خُزَيْمَةَ.

208. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అనస్ (రజి) తెలిపారు: "నా అనుచర సమాజం ఆచరణలు నా ముందు సమర్పించ బడ్డాయి. (పుణ్యప్రదమయిన) ఈ ఆచరణలలో మనిషి మస్జిద్ నుండి తీసి బయటపారవేసే ఓ చిన్న చెత్తముక్కను కూడా నేను చూశాను." (ఈ హదీసును అబూదావూద్, తిర్మిజీ ఉల్లేఖించారు - తిర్మిజీ దీనిని 'గరీబ్ (అరుదైనది)గా ఖరారు చేశారు, ఇబ్నె ఖుజైమ దీనిని ప్రామాణికమైనదిగా నిర్ధారించారు)

**సారాంశం**

అతి చిన్న సత్కార్యం కూడా లెక్కలోనికి వస్తుందనీ, చిత్తశుద్ధి ఉంటే ఆ చిన్న సదాచరణే ఒక్కోసారి పెద్ద పుణ్యఫలాన్ని ఆర్జించిపెడుతుందనీ ఈ హదీసు భావం. మస్జిదుల పరిశుభ్రత, పరిశుద్ధతల గురించి ఇస్లాం తన అనుయాయులకు గట్టిగా తాకీదు చేస్తోంది. ఒక చిన్న గడ్డిపరక,

రద్దీముక్క కూడా మస్జిదులో ఉండకుండా మనం జాగ్రత్తపడాలి. ఎవరయినా ఈ తేలికపాటి పనిని కూడా సంకల్పశుద్ధితో చేస్తే దాని సత్ఫలం అతనికి తప్పక లభిస్తుంది.

(٢٠٩) وَعَنْ أَبِي قَتَادَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «إِذَا دَخَلَ أَحَدُكُمُ الْمَسْجِدَ فَلاَ يَجْلِسْ حَتَّى يُصَلِّيَ رَكْعَتَيْنِ». مُتَّفَقٌ عَلَيْهِ.

209. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారని హజ్రత్ అబూ ఖతాద (రజి) ఉల్లేఖించారు: "మీలో ఎవరు ఎప్పుడు మస్జిద్‌లో ప్రవేశించినా కూర్చునే ముందు రెండు రకతుల (నఫిల్) నమాజు చేయాలి."

(బుఖారీ, ముస్లిం)

**సారాంశం**

ఈ హదీసులో ప్రస్తావించబడిన నఫిల్ నమాజును 'తహియతుల్ మస్జిద్' అనంటారు. షాఫయీల దృష్టిలో ఇది తప్పనిసరి. కాగా; అత్యధికమంది ధర్మవేత్తలు దీనిని అభిలషణీయం (ముస్తహబ్) గా భావించారు. హదీసులోని తాకీదును దృష్టిలో పెట్టుకుని కొంతమంది పండితులు నఫిల్ నమాజులను మక్రూహ్ వేళల్లో కూడా చేసేందుకు అనుమతించారు. ఈ హదీసు దృష్ట్యా మనకు బోధపడే మరో విషయమేమిటంటే; మస్జిద్ వేదికపైనుండి ఖతీబ్ ప్రసంగిస్తున్నప్పటికీ మస్జిద్‌లోకి ప్రవేశించిన వ్యక్తి రెండు రకతుల నమాజ్ చేసి మరీ కూర్చోవాలి.

**7వ అధ్యాయం**

## ٧ - بَابُ صِفَةِ الصَّلاَةِ

## నమాజ్ చేసే విధానం

(٢١٠) عَنْ أَبِيْ هُرَيْرَةَ رَضِيَ اللَّهُ تَعَالَى عَنْهُ، أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: إِذَا قُمْتَ إِلَى الصَّلاَةِ فَأَسْبِغِ الْوُضُوءَ، ثُمَّ اسْتَقْبِلِ الْقِبْلَةَ فَكَبِّرْ، ثُمَّ اقْرَأْ مَا تَيَسَّرَ مَعَكَ مِنَ الْقُرْآنِ، ثُمَّ ارْكَعْ حَتَّى تَطْمَئِنَّ رَاكِعاً، ثُمَّ ارْفَعْ حَتَّى تَعْتَدِلَ قَائِماً، ثُمَّ اسْجُدْ حَتَّى تَطْمَئِنَّ سَاجِداً، ثُمَّ ارْفَعْ حَتَّى تَطْمَئِنَّ جَالِساً، ثُمَّ اسْجُدْ حَتَّى

210. హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపదేశించారు - "మీరు నమాజ్ చేయ సంకల్పించినపుడు ముందు సరిగ్గా వుజూ చేసుకుని ఖిబ్లా వైపునకు తిరిగి తక్బీర్ (అల్లాహు అక్బర్) పలకండి. తరువాత దివ్య ఖుర్ఆన్‌లో ఎంత భాగం మీకు జ్ఞాపకమున్నా అందులో నుంచి సులువుగా చదవగలిగినంత చదవండి. తరువాత 'రుకూ' చేయండి. రుకూ సాధ్యమైనంత వరకు తాపీగా చేయండి. తరువాత